


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

సోమవారం | 05 | జనవరి | 2026 | పేజీలు: 08


### సమన్వయంతో పని చేస్తే

# అద్భుత ఫలితాలు

### కలెక్టర్ జితేష్ వి పాటిల్




**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత ప్రతినిధి :** ప్రభుత్వ ఉద్యోగులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో అభివృద్ధి రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. టీఎన్జీవో, టీజీవో, ట్రస్మా ఆధ్వర్యంలో పాల్వంచలోని ఓ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన 'ప్రగతి టుగెదర్' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఇప్పటివరకు సాధించిన ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన కలెక్టర్, అభివృద్ధికి కావలసిన వనరులు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయని, వాటిని సమర్థంగా వినియోగించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మునగ, అజోల్ల, సమీకృత వ్యవసాయం, కొర్రమీను, కంజు పిట్టల పెంపకం, బయోచార్, ఇటుకల తయారీ వంటి రంగాల్లో ఇప్పటికే మెరుగైన ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలపై మరింత దృష్టి సారిస్తే రైతాంగం ఆర్థికంగా ముందడుగు వేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలకు చేరువయ్యేలా వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం విజయవంతంగా కొనసాగుతోందని, గిరిజన మ్యూజియాన్ని ఆధునికీకరించి సందర్శకుల సంఖ్యను పెంచినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, పంచాయతీరాజ్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



### పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు

# సాధించాలి

### విధుల పట్ల బాధ్యతగా ఉండాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి :** 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులు, విద్యా బోధన తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వం ..మిగతా 2లో



### అంధుల జీవితంలో

# వెలుగులు




### వెలుగుల ప్రదాత బ్రెయిలీ

### కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** అంధుల కోసం లిపిని సృష్టించి వారి జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం మెట్టుగడ్డ లోని శిశు గృహ లో లూయిస్ బ్రెయిలీ 217 వ జయంతి వేడుకలను ..మిగతా 2లో

# పేదల ఆరోగ్యానికి భరోసా

### సీఎం సహాయ నిధి చెక్కులు అందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### కేశంపేట్, కొత్తూరు, నందిగామ మండలాల్లో

### 114 మందికి పంపిణీ



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** పేదల ఆరోగ్య రక్ష ఒక దీక్షల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, నిరంతరం పేదల ఆరోగ్యానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సీఎం సహాయ నిధి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోట్ల రూపాయలు అందిస్తున్నారని ఆయన వెల్లడించారు. షాద్ నగర్ నియోజకవర్గ ..మిగతా 2లో

## అంధుల జీవితంలో వెలుగులు

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని జరీనా బేగంతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధులు సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండేలా ఆలోచించి లూయిస్ బ్రెయిలీ ఆరు చుక్కలతో కూడిన లిపిని తయారు చేశారన్నారు. దివ్యాంగులు సమావేశంలో సలహాలు,సూచనలు,ఇబ్బందులను ప్రస్తావనకు తీసుకువచ్చారని తెలిపారు. జిల్లా యంత్రాంగం ప్రతి నెల మొదటి బుధవారం దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ లకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కారంకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ సంక్షేమ అధికారిణి జరీనా బేగం, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, డాక్టర్ రమ్య, దివ్యాంగులు, వయో వృద్ధులు పాల్గొన్నారు

## పేదల ఆరోగ్యానికి భరోసా



**మొదటి పేజీ తరువాయి...**

పరిధిలో ఎవరికి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా సహాయ నిధి కింద డబ్బులు చెల్లించామని, భవిష్యత్తులను ఇదే విధంగా కొనసాగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేశంపేట పరిధిలో 46 మంది లబ్ధిదారులకు 18 లక్షల 80 వేలు, కొత్తూరు మండలంలో 32 మంది లబ్ధిదారులకు 13 లక్షల 95వేలు, నందిగామ మండలంలో 36 మంది లబ్ధిదారులకు 14 లక్షల 84 వేల 500 కలుపుకొని మొత్తం 18 లక్షల 12 వేల రూపాయలను చెక్కుల రూపంలో ఆయన చెల్లించారు. ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం



**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల పరిధిలోని రాఘవాపురం గ్రామ సర్పంచ్ గా గెలిచిన నెల రోజుల లోపే ప్రధానంగా గ్రామ సమస్యలపై దృష్టి పెట్టిన సర్పంచ్ యరుకల యతీశ్వర్ గౌడ్,పాలకవర్గం..రాఘవాపురం గ్రామం నుండి వివిధ పార్టీల నాయకులు 40 మందితో స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ని స్వయంగా వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు..అనంతరం సర్పంచ్ యతీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి పల్లెర్ల గ్రామం నుండి, రాఘవాపురం గ్రామం మీదుగా దుప్పల్లి స్టేజీ వరకి డాంబర్ రోడ్డు లేకపోవడం,ఆ మట్టి రోడ్డులో అనేక ప్రమాదాలు జరగడం?ముఖ్యంగా రైతులు వర్షాకాల సమయంలో చాలా ఇబ్బందులు పడడం వంటి సమస్యల దృష్ట్యా..గ్రామంలోని ఇట్టి సమస్యను ప్రధాన సమస్యగా చూపిస్తూ...సర్పంచ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు వివరించడం జరిగింది.ఇట్టి విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి,త్వరలో రోడ్డు మంజూరు చేపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**మొదటి పేజీ తరువాయి...**

అన్ని ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు విద్యాబోధన అందించి వార్షిక పరీక్షలకు





సన్నద్ధం చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ మొహం పెట్టుకొని పుర పోరుకు వెళ్తారు

**కొత్త పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, 6 గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం**

**బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్**

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మొహం పెట్టుకుని పట్టణాల్లో ఉన్న ప్రజలను ఓట్లు అడుగుతారనీ రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు మఠం రిషికేష్ ప్రశ్నించారు . ఎన్నికల ముందు తండోప తండాలుగా దొంగ హామీలు ఇచ్చి ఇప్పుడు 2 సంవత్సరాల పాలన పూర్తయినా కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ



స్థానిక మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అమలు కాని హామీల విషయంలో ప్రజలు తప్పకుండా ప్రశ్నిస్తారని అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను ఇండ్ల ముందలకు వస్తే విద్యార్థుల ఐదు లక్షల భరోసా కార్డులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, వృద్ధాప్య పెన్షనర్లు, నిరుద్యోగులు, రిటైర్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ అందక చనిపోతున్న విశ్రాంత ఉద్యోగులు నిలదీస్తారని అన్నారు. షాదీ ముబారక్లు, కళ్యాణలక్ష్మీలు, మహిళలకు స్కూటీలు, రేషన్ కార్డులు, ఉచిత కరెంటు, అసంపూర్తిగా రోడ్లు వంటి ఎన్నో అమలు కానీ హామీలపై ప్రతి ఒక్కరు కూడా కాంగ్రెస్ నాయకులను, అభ్యర్థులను నిలదీయాల్సిందిగా అలాగే ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను బోల్తా కొట్టిస్తూ యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయం అని బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్ తన ప్రకటన పేర్కొన్నారు.

# నాటే పద్ధతికి స్వస్తి అలుకుడుకు మొగ్గు

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు ప్రాంతంలో వరి సాగులో నాటే పద్ధతికి స్వస్తి చెప్పి అలుకుడు వ్యవసాయం పట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు. వరి నాటుతో పెట్టుబడులు పెరుగుతుండటం తగ్గించుకునే దిశగా వరి నాటు విధానాన్ని రైతులు మెల్ల మెల్లగా తగ్గించుకుని అలుకుడు విధానాన్ని అవాలంబిస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్లో 20 శాతం అలుకుడు వ్యవసాయం చేయగా, రబీలో 30 శాతానికి పెరిగింది. వరి నాటు కూలిలకు, నారు పెంపకానికి సుమారు ఏడున్నర వేల నుండి 8వేల రూపాయల వరకు వస్తుండటంతో అలుకుడు వల్ల ఆ మేరకు ఖర్చు తగ్గడం, కూలీల అవసరం పూర్తిగా తగ్గడంతో రైతులు అలుకుడు విధానం పై మొగ్గు



చూపుతున్నారు. వరి నాటుతో ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వస్తుందని, అలుకుడు విధానంలో కూడా అంతే దిగుబడి వస్తున్నదని అలుకుడు విధానమే మేలయిందని రైతులు అలుకుడు విధానాన్ని ఇప్పటివరకు 30 శాతం అవాలంబిస్తున్నారు భవిష్యత్ లో మరి కొంతమంది రైతులు పాటించే అవకాశాలున్నాయి.

# ఉపాధి చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి




## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి :** అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని,కేంద్ర ప్రభుత్వం స్కీమ్ గా మార్చాలి అనే ఆలోచనను ఉప సంహరించు కోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు.ఆదివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో అమలు చెయ్యాలి అనే డిమాండ్ తో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవన్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు.వలసల నివారణ కోసం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ చట్టం స్ఫూర్తికే విఘాతం కలిగించే విధంగా చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు.ఉపాధి హామీ చట్టంలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందికి ప్రతి నెల రెగ్యులర్ గా వేతనాలు ఇవ్వాలి అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఇటీవల పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ కొత్త బిల్లులో ఉపాధి హామీ కూలీలకు నష్టం కలిగించే చర్యలు చేపట్టిందన్నారు.మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును వికసిద్ భారతి గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజావిక మిషన్ ( గ్రామీణ) చట్టం విబిజి రాంజీ 2025 గా మార్చిందన్నారు.ఈ బిల్లులో వ్యవసాయ పనులు జరిగే సందర్భంగా 60 రోజులు ఉపాధి కూలీలకు పనులు ఇవ్వకూడదని ఈ బిల్లులో పేర్కొన్నారు అని చెప్పారు. ఉపాధి హామీ చట్టంలో సన్న, చిన్న కారు రైతులు,దళిత, గిరిజన కుటుంబాలకు చెందిన వారికి శ్రమ ఆధారిత పనులు266 పనులను ఈ బిల్లులో తొలగించారన్నారు. కేంద్రం 60 శాతం,రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరించాలి అని చెప్పడంలో అర్థం లేదన్నారు.ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడి పనిచేస్తున్నాయని ఈ పరిస్థితుల్లో 40 శాతం రాష్ట్రాలు సాధ్యం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పాత పద్ధతిలో ఈ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హ స్సేన్ , తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి, సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు లింగా నాయక్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి,కిరాణా, ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మినారాయణ,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక సోమయ్య గౌడ్,బాలాజీ నాయక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి,ఐఎఫ్టియు జిల్లా నాయకులు కొనుకుంట్ల సైదులు, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాక లింగయ్య,బహుజన మహాసభ రాష్ట్ర నాయకులు నారబోయిన వెంకట్ యాదవ్, ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జహంగీర్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోలిశెట్టి యాదగిరిరావు, మందడి రామ్ రెడ్డి,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి యాదయ్య, సిఐటియు పట్టణ నాయకులు వల్లపుదాసు సాయి కుమార్,బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలు





**వరంగల్, అక్షిత బ్యూరో:** డా.లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య తో కలిసి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా అంధ ఉద్యోగుల సంఘంచే రూపొందించిన క్యాలెండర్ ను ఎంపీ, కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమం లో ప్రాంతీయ కంటి ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ భరత్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి, సంఘం అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుడు నోముల నర్సిరెడ్డి మృతి బాధాకరం

## డాక్టర్ చెరుకు సుధాకర్



**వలిగొండ /అక్షిత న్యూస్:** తెలంగాణ ఉద్యమకారుడు నోముల నర్సిరెడ్డి మృతి బాధ కరమని డాక్టర్ చెరుకు సుధాకర్ విచారం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేసి రాష్ట్ర సాధన ఉద్యమంలో జైలు జీవితం గడిపిన వలిగొండ మండలం ఏదుళ్ళగూడెం గ్రామానికి చెందిన నోముల నర్సిరెడ్డి అనారోగ్యం వలన ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఉద్యమకారుడు మృతి చెందారన్న వార్త తెలియడంతో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పిడి యాక్ట్ పెట్టిన లెక్క చేయకుండా రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ యోధుడు డాక్టర్ చెరుకు సుధాకర్ ఆదివారం నోముల నర్సిరెడ్డి పార్థివ దేహం పై పుష్పగుచ్చం పెట్టి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ ఉద్యమకారుల త్యాగాలు వృధా కావన్నారు చరిత్రలో ఉద్యమకారులు నిలిచిపోతారని అన్నారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ మరో ఉద్యమకారుడు టీయూజెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆంధ్రప్రభ రిపోర్టర్ పడమటి దామోదర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి, పలుసం రమేష్, కొమురెల్లి సంజీవరెడ్డి,దేగల పాండు నరేష్ రెడ్డి,ఈతప మల్లేశం బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి, మారగొని శ్రీనివాస్ గౌడ్,పబ్బు నరసింహ శీలం స్వామి ఎక్కల దేవి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## కామ్రేడ్ సాయిలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన

# ఎం సి పి ఐ యు పార్టీ మండల కార్యదర్శి గుగులోతూ అరుణ్ నాయక్

**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన ఎం సి పి ఐ పార్టీ సీనియర్ నాయకులు చిన్నపాక సాయిలు గత నెల 28 తేదీన అనారోగ్యంతో మరణించగ సాయిలు కుటుంబానికి 10,000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించి వారి కుటుంబానికి ఎల్లవేళలా ఆదుకుంటామని గుగులోతు అరుణ్ నాయక్ భరోసా ఇచ్చారు. ఉమ్మడి సన్నూరు గ్రామంలో అమరజీవి కామ్రేడ్ గుగులోతు నాను నాయక్ ఆధ్వర్యంలో సన్నూరు గ్రామంలో అనేక ప్రజా పోరాటాలు చేసిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడిగా గుర్తింపు పొందిన కామ్రేడ్ సాయిలు కడదాక కమ్యూనిస్టు నాయకుడిగా ప్రజా ప్రజా సమస్యల మీద పోరాడిన విప్లవ వీరుడు సాయిలు వారి మరణం యావత్ ప్రజానీకానికి పార్టీకి వారి కుటుంబానికి తీరని లోటుగా భావిస్తున్నాం సన్నూరు గ్రామంలో



సాయిలు జ్ఞాపకార్థంగా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేస్తామని అరుణ్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమం లో సన్నూర్ సర్పంచ్ రజిత, రాంబాబు, నాయకులు కాయిత వెంకన్న, బుర్కా యాకయ్య, ఆంబోతు మల్లేశం, గుగ్గులోతు లక్ పతి, కోటియా నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలి

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు మథిన్ సహకారంతో జిల్లా స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ రూరల్ టోర్నమెంట్ క్రీడా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో మహబూబ్‌నగర్ నుంచి పలువురు క్రీడాకారులు భారత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కోరియా, జపాన్ వంటి దేశాల తరహాలో క్రీడా రంగం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. క్రీడాకారులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో శిక్షణ పొందాలని, గెలుపు?ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని ఆయన సూచించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించేందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. త్వరలోనే రూ.16 కోట్ల వ్యయంతో జిల్లా క్రీడా మైదానం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా రంగంలో మరింత ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకుముందు నిర్వాహకులు ఏర్పాటు చేసిన కేక్ ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, , మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, అంజద్, ప్రశాంత్, నాయకులు చెన్న వీరయ్య , శేఖర్, శ్యాం , హన్డ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రజినీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత దంత వైద్య శిబిరం ప్రారంభం



**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో సిద్దాపురం ఏనుగు సత్యనారాయణ రెడ్డి ఫాం హౌజ్ లో యుఎస్ఏ కు చెందిన డాక్టర్ ఉజ్వల్ రెడ్డి..గుమ్మి లు కలిసి ఉచిత దంత వైద్య శిబిరం ప్రారంభించారు. 4 వ తేదీ నుండి 5,6,7 వరకు ఉచితంగా సేవలు నిర్వహిస్తామని అన్నారు.. ఆదివారం మొదటి రోజు 30 మంది పేషెంట్ లకు వైద్య సదుపాయం అందించారు. ఈ సందర్బంగా డాక్టర్ ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో సేవ చేయటం అదృష్టంగా భావిస్తున్నానని మిగతా వైద్య సేవలు కొరకు హైదరాబాద్ పంపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షులు మాజీ జెడ్పిటీసి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు,మాజీ ఎంపిపీ హేమలత రాజు,పల్లెర్ల గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహా గౌడ్,రెడ్ క్రాస్ మండల ప్రధాన కార్యదర్శి కొత్త కొండ శ్రీనివాస్,సభ్యులు తవిటి మురళీ,జెట్ట యాదగిరి,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోతగాని మల్లేశం,ఎన్ఆర్ఐలు గుమ్మి దయానంద్,ఏనుగు వెంకటరెడ్డి,ఏనుగు రామ లక్ష్మారెడ్డి,మాద నర్సయ్య, తుమ్మల నర్సరెడ్డి,జక్కుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..

## క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలి

**మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి**

**దూస్కల్ ప్రీమియర్ లీగ్ డిపిఎల్ సెషన్ 11క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** యువత క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తూ ముందుకు సాగాలని షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే చావులపల్లి ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని దూస్కల్ గ్రామంలో సర్పంచ్ జ్యోతిర్మయి అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన దూస్కల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ను ముఖ్యఅతిథిగా పాల్గొని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేని శాలువతో సన్మానించిన దూస్కల్ గ్రామ సర్పంచ్ జ్యోతిర్మయి అంజి మరియు గ్రామస్తులు, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత కృషి పట్టుదలతో కష్టపడి క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదు, అవి ఆరోగ్యకరమైన జీవితానికి, విజయవంతమైన భవిష్యత్తుకు పునాది వేస్తాయని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుతోపాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి వంటివి సాధించవచ్చని, ఇవి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి దోహదపడతాయని అన్నారు. అంతేకాకుండా మన గ్రామం నుంచి జిల్లా స్థాయిలో మరియు రాష్ట్ర స్థాయిలో పాల్గొనాలని కోరారు, యువతకు తన పూర్తిసహకరం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, దూస్కల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగారం యాదయ్య, చందు యాదవ్, నజీర్, ఆంజనేయులు గౌడ్, నందు గౌడ్, ఖాజా, శ్రీధర్ గౌడ్, జంగయ్య, ఫయాజ్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుక, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..** శ్రీమతి సావిత్రిబాయి పూలే 195 వ జయంతి సందర్భంగా గోపినగర్‌లోని జన చైతన్య ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ , గుల్మోహర్ కాలని అధ్యక్షులు ఖాసిం , రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత ఎండ్లూరి మానస , రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మెర్సీ మార్గరెట్ , పద్మారావు , రవీందర్ గౌడ్ , రాజేశ్వరమ్మ, సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసారు ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బజార్గట్ రమేష్ మాట్లాడుతూ కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది, 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించింది. ఈ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా "నా విధిని నేను నిర్వహిస్తున్నాను" అని చెప్పేది. అయినా రోజూ వేధింపులకు విసిగి ఒకరోజు ఒకడి చెంప పగులకొట్టింది అని గుర్తు చేశారు. శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన దాదాపు 300 మందికి సంఘ సభ్యులు బోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బజార్గట్ రమేష్, ఉప్పరీ సత్యం, డాక్టర్ ముసలయ్య , రంగుల ప్రవీణ్, సందీప్, వెంకటేష్, సాయినాథ్, పీ. ఆనంద్, యేసు, గండయ్య, రాములు,అనీల్, దస్తగిరి, ఏజస్, తుకారాం, ఎర్రోళ్ల ఆనంద్, సత్యం, శివ, గోపి, నాగలక్ష్మి, ఎర్రోళ్ల రాధిక, సుగుణ, కవిత, పద్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## ఈటూరులో మృతుని కుటుంబాన్ని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పరామర్శ

**మృతుని కుటుంబానికి రూ.10,000/- వేల ఆర్థిక సహాయం**

**గోడదాటి సత్తయ్య మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సంతాపం**

**ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని స్పష్టం**



**నాగారం అక్షిత న్యూస్ :** మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో కాంగ్రెస్ నాయకుల పరామర్శ – గోడదాటి సత్తయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం. ఈటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోడదాటి సైదులు తండ్రి గోడదాటి సత్తయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోడదాటి సత్తయ్య ఆకస్మిక మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ ఈ కష్ట సమయంలో పార్టీ తమ వెంట ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.10,000/-పదివేల రూపాయలను తక్షణ ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సహాయం కుటుంబానికి కొంతైనా ఊరట కలిగిస్తుందని, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోడదాటి సత్తయ్య గ్రామాభివృద్ధి, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలతో అనుబంధం పెంచుకున్న వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన సేవలను గ్రామ ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ మానవీయ విలువలకు పెద్దపీట వేస్తుందని వారు తెలిపారు. శోక సమయంలో కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం పార్టీ యొక్క సేవ భావానికి నిదర్శనమని అన్నారు. ఈటూరు సీనియర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని మృతుని కుటుంబానికి సంతాపం తెలియజేశారు. గోడదాటి సత్తయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు ఈ దుఃఖాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు మరిచిన రేవంత్

**బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**



**గజ్వేల్, అక్షిత ప్రతినిధి :** గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మల్లన్నసాగర్ కొండపోచమ్మ సాగర్ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటిగడ్డ కిష్టాపూర్ లో చేసిన దీక్షలో ఇచ్చిన హామీలు మరచారని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ముంపు గ్రామాల ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు

గతంలో వర్గల్ ఇండస్ట్రియల్ లో భూ సేకరణలో వేసుకొని కుర్చునీ కెసిఆర్ ప్రభుత్వంలో పది లక్షల ఇస్తున్నారని మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రకారం ఎకరానికి 60 లక్షలు ఇస్తామని చెప్పిన ఇప్పటి కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ఉత్తంకుమార్ రెడ్డి , దామోదర్ రాజనర్సింహా గజ్వేల్ పర్యటనలకు వచ్చినప్పుడు వర్గల్ మండల రైతులతో పెద్ద ఎత్తున అడ్డుకొని నిరసన తెలుపుతామని హెచ్చరించారు

గజ్వేల్ కాంగ్రెస్ నిరుద్యోగులు కెసిఆర్ ఫామ్ హౌస్ దగ్గర ధర్నా చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగం ఇస్తారని ముఖ్యమంత్రి మెప్పుకోసం రాజకీయ లబ్ధి కోసం గజ్వేల్ కాంగ్రెస్ నిరుద్యోగులు ధర్నా చేయడం చాలా విడ్డూరంగా హాస్యాస్పదంగా ఉందని గజ్వేల్ నియోజకవర్గం లో కాంగ్రెస్ నిరుద్యోగులు ఖాళీగా ఉన్నారని ఎద్దేవ చేశారు గజ్వేల్ కాంగ్రెస్ నిరుద్యోగులు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర చాలా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పొద్దున లేచి రేవంత్ రెడ్డి దగ్గర మోకరిల్లితే ఆఫీసు బాయ్ నుంచి మొదలు పెడితే కార్పొరేషన్ చైర్మన్ ల వరకు చాలావరకు ఖాళీగా ఉన్నాయని అక్కడ వెళ్లి ధర్నాలు చేసి ఉద్యోగాలు చేయాలని ఎద్దేవా చేశారు

పదవుల కోసం తాపత్రయపడే గజ్వేల్ కాంగ్రెస్ నిరుద్యోగులు కెసిఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు

గజ్వేల్ కాంగ్రెస్ నిరుద్యోగులకు ఉద్యోగం మీద ఉన్న సోయి గజ్వేల్ అభివృద్ధి మీద లేదని మండిపడ్డారు.

మీరు చేసే ధర్నా ఎలా ఉందంటే ఆకాశానికి సున్నం వేసే విధంగా మీ వెర్రి వేషాలు ఉన్నాయని తెలిపారు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్న మొన్నటి వర్షాలకు గజ్వేల్ నియోజకవర్గంలో రోడ్లకు పడిన గుంతలు కూడా పూడ్చలేదని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధిలో జీరోగా కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని అభివృద్ధి చేయడంలో పూర్తిగా కాంగ్రెస్ విఫలమయ్యారని మండిపడ్డారు అభివృద్ధి చేయడానికి చేతగాని దద్దమ్మ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని మండిపడ్డారు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే వెంటనే ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గంలో దాదాపు వేలాదికోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరగాయని, గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమంలో 50 సంవత్సరాలు ముందుకు వెళ్లిందని గజ్వేల్ నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయని తెలిపారు .

కెసిఆర్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం గజ్వేల్ కాంగ్రెస్ నిరుద్యోగులకు కనిపియ్యకపోతే కంటి వెలుగు అద్దాలను మీ కండ్లకు పెట్టి చూపెడతామని తెలిపారు.

గజ్వేల్ నియోజకవర్గంలో కొండపోచమ్మ సాగర్ మల్లన్నసాగర్ ద్వారా మండలాల్లో సైతం రైతులకు సాగునీరు అందించిన నాయకుడు కేసీఆర్, ప్రతి ఇంటికి సురక్షితమైన గోదావరి నల్ల నీరు అందించిన మహా నాయకుడు కేసీఆర్ అన్నారు గజ్వేల్ కు రింగ్ రోడ్డు, ప్రతి గ్రామానికి డబుల్ రోడ్లు, అగ్రికల్చర్ యూనివర్సిటీ ఫారెస్ట్ కళాశాల హార్టికల్చర్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మహతి ఆడిటోరియం ఐఓసి బిల్డింగులు, ఎడ్యుకేషన్ హబ్ లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, గ్రామాలలో పల్లె ప్రగతి పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాల పట్టణాల యొక్క రూపురేఖలను మార్చిన నాయకుడు కేసీఆర్ అన్నారు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అవినీతి లేకుండా నేరుగా ఇంటికి అందజేసిన మహా నాయకుడు కేసీఆర్ అన్నారు.

గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో వేలాదికోట్లతో అభివృద్ధి జరిగితే

కనీసం ఇప్పుడు మీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క శాతం అభివృద్ధి అయిన ఇప్పటివరకు చేశారా అని ప్రశ్నించారు. మీకు కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు అన్నారు.గత డెబ్బై సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలు బిందెలతో బోర్ల దగ్గర నుండి నీళ్లు మోసేవారని, కరెంటు లేక పంటలు పండేవి కావని, రైతులకు యూరియాలు విత్తనాలు దొరకలేదని, రైతు ఆత్మహత్యలు జరిగేవని గుర్తు చేశారు.నేడు కూడామీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలంలో ఒక్క రూపాయి అభివృద్ధి కార్యక్రమం చేపట్ట లేదని ఒక తట్టెడుడు మన్ను కూడా తీయలేదని గతంలోని కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన 180 కోట్ల రూపాయలను రద్దు చేశారని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, మాజీ జెడ్పిటిసి పంగా మల్లేశం, పిఎసిఎస్ చైర్మన్ జేజేల వెంకటేష్ గౌడ్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, మాజీ వైస్ చైర్మన్ జాకీయుద్దీన్ మాజీ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, మరికంటి కనకయ్య, బొగ్గుల చందు, మామిడి శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ ఆర్ కాలనీ కిష్టాపూర్ సర్పంచ్ ప్రతాపరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గుల సురేష్ , సీనియర్ నాయకులు నర్సింగా రావు,నాయకులు భూపాల్ రెడ్డి, గోలి సంతోష్, పాల రమేష్ గౌడ్ , అహ్మద్ తదితరులు ఉన్నారు

## ముగ్గులు మన సంస్కృతి చిహ్నాలు మాజీ ఎమ్మెల్యే నరేందర్



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ లో ఓ పత్రిక నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమానికి వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా వరంగల్ పట్టణానికి చెందిన మహిళా మణులు వేసిన వివిధ రకాల అర్థవంతమైన, ఆకర్షణీయమైన ముగ్గులను మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న,మహిళల సమస్యలను ముగ్గుల రూపంలో ప్రతిబింబిస్తూ ఇచ్చిన సందేశాలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు.

రానున్న రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో మరింత ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనని, ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రత్యేక కాన్సెప్ట్‌తో వినూత్నంగా ముగ్గులు వేయడం అభినందనీయమని తెలిపారు. ముందస్తుగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

## పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి**



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి :** 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులు, విద్యా బోధన తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు విద్యాబోధన అందించి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పేద పిల్లల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న దుర్గాపూర్ మదర్స వ్యవస్థాపకులు

# మౌలానా అబ్దుల్ ఖాదిర్ సాహెబ్ అభినందనీయులు

**మౌలానా అహమద్ నద్వీ చైర్మన్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ...**





**కోదాడ అక్షిత ప్రతినిధి:** పేద పిల్లల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న దుర్గాపూర్ మదర్స వ్యవస్థాపకులు మౌలానా అబ్దుల్ ఖాదిర్ అభినందనీయులని జమైతుల్ ఉల్ మా రాష్ట్ర అధ్యక్షుడు ఎహెసాసోద్దిన్, ప్రధాన కార్యదర్శి సబీర్ సాహెబ్ లు అన్నారు. ఆది వారం కోదాడ లోని దుర్గాపురం మదర్సా లో జమైతుల్ ఉల్ మా రాష్ట్ర అధ్యక్షుడు ఎహెసాసోద్దిన్ కు నిర్వహించిన అభినందన సన్మాన కార్యక్రమం లో వారు మాట్లాడారు. గత 50 ఏళ్లుగా వేలాది మంది పేద పిల్లలకు ఉచిత వసతి, ఉచిత ఆధ్యాత్మిక, సాధారణ విద్యను అందిస్తూ ప్రయోజకులు చేయడం లో పాఠశాల వ్యవస్థాపకులు అబ్దుల్ ఖాదర్ సాహెబ్ ప్రశంస నీయులన్నారు. కాగా పాఠశాల లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ గురువు అబ్దుల్ ఖదీర్ కు కారు బహుకరించి తమ గురు భక్తిని చాటుకున్నారు. గురువు వల్లే తాము సమాజం లో ఉన్నత స్థాయి కి ఎదిగామని గురువు కు ఏమి ఇచ్చిన తమ ఋణం తీరదన్నారు. పూర్వ విద్యార్థులు గురువు కు బహుమతి గా కారు ఇవ్వడం పట్ల పూర్వ విద్యార్థులను ముఖ్య అతిథులు అభినందించారు.కాగా ఆర్గనైజర్ మదీనా మోడల్ స్కూల్ చైర్మన్ మౌలానా అహ్మద్ నద్వి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు, ఆధ్యాత్మిక జిజ్ఞాస పెంపొందించడమే తమ లక్ష్యం అన్నారు.కాగా వివిధ ప్రాంతాల నుండి వెయ్యి మందికి పైగా పూర్వ విద్యార్థులు, ఆధ్యాత్మిక వేత్తలు తరలి వచ్చారు. ఆర్గనైజర్ మౌలానా అహ్మద్ నద్వి అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షుడు మౌలానా అతహర్, మిరాజుదిన్, మౌలానా హమీద్ సాబ్,హఫీజ్ అబ్దుల్ ఖదీర్, ముఫ్తి అతహర్ తదితరులు పాల్గొన్నారు.

## మా కాలనీయే మా బలం

**మా కాలనీ ప్రజలే మా బలగం**

**పురేందర్ రెడ్డి**



**కూకట్ పల్లి, అక్షిత ప్రతినిధి:** 2026 నూతన సంవత్సరం పురస్కరించుకొని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలని లో పనిచేసే కార్మికులకు శాలువాతో సన్మానించి మెమొంటో అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పురేందర్ రెడ్డి. ఆదివారం రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆహ్వాన మేరకు కిరణ్ పంతులు విచ్చేసి కేక్ కట్ చేసి అధ్యక్షులు కార్యదర్శులకు కేకు తినిపించడం జరిగింది. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటయి 40 సంవత్సరాలు కాలనీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు, కార్మికులకు, అధికారులకు, వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న వారికి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి.ప్రసాద్, చంగల్రెడ్డి, శ్రీధర్ రావు,లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ రెడ్డి,సూర్యనారాయణ, కిషోర్,పురుషోత్తం, కె.వి.రావు,రవి కిరణ్,నరేందర్ రెడ్డి,సునీల్ పటేల్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కేర్ అండ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కూకట్ పల్లి, అక్షిత ప్రతినిధి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి పటేల్ కుంట పార్కు దగ్గర కేర్ అండ్ క్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ,షుగర్, తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ ఎన్.వంశీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలనీ పోషక విలువలున్న ఆహారం తీసుకొని, ప్రతి రోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఇలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకొని డాక్టర్ సలహా మేరకు సరైన మందులు వాడితే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన తెలిపారు.

## మృతుని కుటుంబానికి మాజీ సర్పంచ్ జక్క వెంకటరెడ్డి చేయూత



**వలిగొండ/ అక్షిత న్యూస్:** వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన గొడుగు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మరణించడం జరిగింది. చాలా నిరుపేద కుటుంబం కావడంతో వారి కుటుంబానికి మాజీ సర్పంచ్ జక్క వెంకట్ రెడ్డి 50 కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుగ్గ మల్లేశ్ గ్రామ నాయకులు, పైల్ల అంజిరెడ్డి,మన్నెం వెంకట్ రెడ్డి, మామిడి సురేష్,వడ్డేమాన్ శ్రీనివాస్,బుగ్గ సత్యనారాయణ, మేకల జహంగీర్, బుగ్గ ప్రవీణ్, బుగ్గ విజయ్,వాకిటి పురుషోత్తం రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని దుండిగల్‌కు మార్చాలని ఎమ్మెల్యేకు వినతి



**అక్షిత న్యూస్ / గాజులరామరం:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం సూరారంలో అద్దె భవనంలో కొనసాగుతోంది. భూముల రిజిస్ట్రేషన్, ఇండ్ల కొనుగోలు?అమ్మకాలు తదితర అవసరాల కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యాలయానికి వస్తుంటారు. అయితే కార్యాలయం ఉన్న పరిసర ప్రాంతంలో తగిన స్థలం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని దుండిగల్ మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కార్యాలయంలో కేపీ వివేకానంద్ను కలిసి వినతిపత్రం అందజేశారు.

సూరారం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద వాహనాల రాకపోకల కారణంగా రోజూ తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సరైన పార్కింగ్ సదుపాయం లేక ప్రజలు రహదారులపై వాహనాలు నిలపాల్సి వస్తోందని, కార్యాలయం చిన్నదిగా ఉండటంతో ప్రజలు వేచి ఉండేందుకు కూడా తగిన సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని దుండిగల్ మండల/మునిసిపల్ కార్యాలయ పక్కన ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనానికి మార్చాలని వారు కోరారు.

దుండిగల్ మండల కార్యాలయ ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉండటంతో పాటు, అదే ప్రాంగణంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం కూడా ఉన్నాయని నాయకులు వివరించారు. ఈ నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అక్కడ ఏర్పాటు చేస్తే ప్రజలకు మరిన్ని లాభాలు చేకూరుతాయని తెలిపారు.

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని దుండిగల్ మండల/తహసీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేస్తే కలిగే లాభాలు:**

ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకే చోట లభించే ఇంటిగ్రేటెడ్ కార్యాలయ సముదాయం ఏర్పడుతుంది.

వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడి సేవలు మరింత వేగంగా అందుతాయి.

ప్రజల సమయం, వ్యయం రెండూ ఆదా అవుతాయి.

ప్రభుత్వ భవనం కావడంతో భద్రత, మౌలిక సదుపాయాలు మరింత మెరుగ్గా ఉంటాయి.

ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సూరారం నుంచి దుండిగల్ మండల కార్యాలయానికి మార్పిడి చేయాలని సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు.

ఈ వినతిపై స్పందించిన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.


ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్మేసిన పొగమంచు

**అప్రమత్తతే ప్రాణ రక్షణ**

**జిల్లా ఎస్పీ డి.జానకి**






**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ :** చలికాలం నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు రాత్రి వేళల్లో, తెల్లవారుజామున పొగమంచు తీవ్రత పెరిగిందని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. పొగమంచు కారణంగా రహదారులపై ముందున్న వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆమె హెచ్చరించారు.

ఈ పరిస్థితుల్లో వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం చిన్న తప్పిదంగా మారి పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశముందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై నిరంతర పోలీస్ పెట్రోలింగ్ కొనసాగుతున్నట్లు తెలిపారు. వాహనదారులు తమ వాహనాల లైటింగ్ వ్యవస్థను ముందుగానే పరిశీలించుకోవాలని, వేగం తగ్గించి ఒకే లైన్‌లో ప్రయాణించాలని, అనవసరంగా ఓవర్‌టేక్ చేయవద్దని సూచించారు. పొగమంచు వేళల్లో మ్యూజిక్ వినడం, తరచూ లైన్ మార్చడం ప్రమాదకరమని, వాహనాల మధ్య తగినంత దూరం పాటిస్తూ హారన్‌లు, ఇతర వాహనాల శబ్దాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. హై-బీమ్ లైట్లకు బదులుగా లో-బీమ్ లైట్లు ఉపయోగించాలి. వేగాన్ని నియంత్రించి ముందున్న వాహనానికి సురక్షిత దూరం ఉంచాలి. రిఫ్లెక్టివ్ జాకెట్లు, స్టిక్కర్లు వాడటం ద్వారా విజిబిలిటీ పెంచుకోవాలి. సడన్ బ్రేకులు వేయకుండా జాగ్రత్త పడాలి. మలుపులు తిరిగే ముందు తప్పనిసరిగా ఇండికేటర్ ఇవ్వాలి. రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలను వీలైనంతవరకు నివారించాలి. చలివల్ల చేతుల నియంత్రణ తగ్గకుండా గ్లౌవ్స్ ధరించాలి. కార్లు, భారీ వాహనాల డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఫాగ్ ల్యాంప్స్ లేదా లో-బీమ్ లైట్లు మాత్రమే వాడాలి. సాధారణం కంటే నెమ్మదిగా వాహనం నడపాలి. ముందున్న వాహనానికి 3?4 రెట్లు ఎక్కువ దూరం ఉంచాలి. డిఫాగర్ వాడాలి లేదా విండోలను కొద్దిగా ఓపెన్ చేసి ఫాగింగ్ నివారించాలి. విజిబిలిటీ తక్కువగా ఉన్నప్పుడు హాజర్డ్ లైట్లు ఉపయోగించాలి. పొగమంచు ప్రాంతాలు, మలుపుల వద్ద ఓవర్‌టేక్ చేయకూడదు. రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లను గమనిస్తూ ప్రయాణించాలి. వైపర్స్, బ్రేకులు, లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో ముందే తనిఖీ చేయాలి. ప్రయాణానికి ముందుగానే బయలుదేరి తొందరపడకుండా గమ్యం చేరుకోవాలని, విజిబిలిటీ అత్యంత తక్కువగా ఉన్న సమయంలో సురక్షిత ప్రాంతంలో వాహనం ఆపి పరిస్థితి మెరుగుపడేవరకు వేచి ఉండాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కోరారు.

## జెడ్పీటీసీ నుంచి కార్పొరేషన్ వరకు

# ఆర్ఎల్డీ పోటీ



### బీసీలను మోసం చేసిన పార్టీలకు బుద్ధి చెబుదాం

### కపిలవాయి దిలీప్ కుమార్

**భద్రాద్రి కొత్తగూడెం , అక్షిత న్యూస్.** బీసీలను మోసం చేసిన రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు బహుజనులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నాయకులు, ప్రజలు సమైక్యంగా ముందుకు రావాలని కపిలవాయి దిలీప్ కుమార్, తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జిల్లా అధ్యక్షులు కట్టా సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ లోక్ దళ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బస్ స్టాండ్ నుంచి గణేష్ బస్తీ, ఆర్టీసీ బస్ డిపో, విశ్వరూప థియేటర్, ఫారెస్ట్ కాంప్లెక్స్ మీదుగా పోస్టాఫీస్ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి పార్టీ శ్రేణులు తమ సంఘీభావాన్ని తెలిపారు.ర్యాలీ అనంతరం పీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పార్టీలో చేరిన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులకు కపిలవాయి దిలీప్ కుమార్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.అలాగే, “లక్ష్యం కోసం లక్ష సైన్యం” అనే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని రాష్ట్రంలో తక్షణమే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమం ద్వారా ఒక లక్ష మంది యువతను నియమించి, రిటైర్డ్ ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ, నిజాయితీ, శారీరక దృఢత్వం పెంపొందించడంతో పాటు, అవినీతికి వ్యతిరేక పోరాటం, యువతకు ఉపాధి కల్పన, యువ సాధికారత, నైపుణ్యాభివృద్ధి శాఖలతో సమన్వయంగా నైపుణ్య శిక్షణ అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నారగోని కమాండర్,ఇన్ చీఫ్‌గా నియమించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నారగోని, వెనుకబడిన తరగతులకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను, ముఖ్యంగా రైతులు మరియు బీసీల సంక్షేమానికి సంబంధించిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఆరు నెలల్లోగా హామీలు అమలు కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ తెలంగాణ చైర్మన్ నారగోని, బీసీ చైర్మన్ ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీఆర్ఎల్డీ అధ్యక్షులు కట్టా సతీష్, యాదాద్రి భువనగిరి ఆర్ఎల్డీ అధ్యక్షులు బీరప్ప, ఖమ్మం ఆర్ఎల్డీ అధ్యక్షులు జానీ, మహబూబాబాద్ ఆర్ఎల్డీ అధ్యక్షులు డివై గిరి, టీఆర్ఎల్డీ ప్రధాన కార్యదర్శులు మడకం ప్రసాద్, నరసింహారావు, జి. వెంకటేశ్వర్లు, జి. వెంకటస్వామి, సుధాకర్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల కోసం ప్రజా సమస్యలపై పోరాడేది

# భారత కమ్యూనిస్ట్ పార్టీ

### సిపిఐ శత వసంతాల ముగింపు సభ ను జయప్రదం చేయండి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ప్రజల కోసం ప్రజా సమస్యలపై పోరాడిది భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు.సిపిఐ శతవసంతాల ముగింపు భారీ బహిరంగ సభ జనవరి 18న ఖమ్మం లో జరుగు సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతా ఆదివారం నేలకొండపల్లి మండలం కు చేరుకుంది. మండల కేంద్రము లో మరియు ముఠాపురం గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం ఉద్యమం నుండి ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. భారతదేశంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని శత వసంతాల ముగింపు సభ ఖమ్మం లో నిర్వహించుకోవడం మనకు గర్వకారణం అని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చి ఫాసిస్టు బిజేపి పాలనకు వ్యతిరేకంగా పోరాటాం చేయాలన్నారు. 40 దేశాల నుంచి ప్రజాప్రతినిధులు మన దేశంలో అని రాష్ట్రల నుంచి సిపిఐ ప్రతినిధులు పార్టీ శ్రేణులు హాజరవుతారు అని తెలిపారు. ఈ భారీ బహిరంగసభ కు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు కర్నాటి భాను ప్రసాద్ సీతామహాలక్ష్మి జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ మండలం కార్యవర్గ సభ్యులు బాగం నరసింహ రావు కౌన్సిల్ సభ్యులు తాళ్లూరి గుగులోతు కాంతమ్మ బానోతు బాలాజీ మూడు శ్రీను గుగులోతు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్ నందు,రెడ్డి సంక్షేమ సంఘం వరంగల్ ఆద్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశం మరియు నూతన సంవత్సర 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించరు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ శ్రీ జంగా రాఘవ రెడ్డి పాల్గొని నూతన సంవత్సర డైరీ ని ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి డివిజన్ మాజీ అధ్యక్షులు దావా సుధాకర్ కుటుంబానికి పరామర్శ



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి:** ఇటీవల మరణించిన గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాజీపేట జూబ్లీ మార్కెట్ కి చెందిన సీనియర్ టిడిపి 62వ డివిజన్ మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు దావా సుధాకర్ ఇంటికి వెళ్ళి వారి చిత్రపటానికి పూలమాల వేసి వారి కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ అర్షణపల్లి విద్యాసాగర్ రావు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీర్తిశేషులు సుధాకర్ పార్టీకి చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. పార్టీ ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బర్ల యాకుబ్, కలమాల మహేందర్, తదితరులు ఉన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరిన పలు కుటుంబాలు



**ఇల్లందు / అక్షిత న్యూస్:** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పాత లింగాల గ్రామం లో రాష్ట్ర అగ్రికల్చర్ డైరెక్టర్ శ్రీ రాంరెడ్డి గోపాల్ రెడ్డి సమక్షంలో బర్లగూడెం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు ఃఖీూ పార్టీ నీ విడి కాంగ్రెస్ పార్టీ లో చేరినారు, వీరికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నర్సింహా రెడ్డి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించినరు.. రాష్టం లో కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్న పథకాలు ఆకర్షతులై పార్టీ లో చేరినారు. అట్టి కుటుంబాలకు పార్టీ సమూచితస్థానం ఇస్తుందని ఈ సందర్బంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వారికీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లోవార్డ్ మెంబర్లు భూక్యా కరుణ, మాలోత్ కవిత, దారావత్ ఈరు అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాలోత్ ప్రేమ్ కుమార్, భూక్యా కిషన్,మాజీ సర్పంచ్ మున్నా నాయక్,ధర్మసోత్ దేవేందర్, నున్నవత్ దేవేందర్, బానోత్ శంకర్, నునవత్ శంకర్, గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు..

# తెలంగాణ ఉద్యమ నిజమైన కళాకారులను ఆదుకోవాలి

**ఎమ్మెల్యే మందుల సామేలుకు సాంస్కృతిక సేన వినతి**

**ఇందిరమ్మ రాజ్యంలో కళాకారుల జీవితాల్లో మార్పు రావాలి**

**సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్**

**టిపిసిసి సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్**



నాగారం అక్షిత న్యూస్ : ఉద్యమ కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపాలి – ఎమ్మెల్యే మందుల సామేలుకు టిపిసిసి సాంస్కృతిక సేన వినతి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, ఒక పూట తిండి తిని రెండు పూటలు పస్తులుండి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన నిజమైన ఉద్యమ కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత నేటి ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన పై ఉందని టీపీసీసీ సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్ స్పష్టం చేశారు. నూతన సంవత్సర సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు మందుల సామేలు ను హైదరాబాదులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ సాంస్కృతిక సేన నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సాంస్కృతిక సేన కళాకారుల దుస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తెలంగాణ గడ్డపై ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యం ప్రజాపాలనలో ఇకనైనా నిజమైన ఉద్యమ కళాకారుల జీవితాల్లో మార్పు రావాలని, వారి బ్రతుకుల్లో వెలుగులు నింపాలని, భవిష్యత్తుకు ఒక బంగారు బాట వేయాలని కోరారు. ముఖ్యంగా ఉద్యమ కాలంలో తమకలతో ప్రజలను చైతన్యపరిచి రాష్ట్ర సాధనకు బలమైన పునాది వేసిన కళాకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. సాంస్కృతిక సారథి భాగములు ఉద్యోగాలు కల్పించి ఉద్యమ కళాకారులకు శాశ్వత జీవనోపాధి కల్పించాలని, వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదుక్కుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేలును కోరారు. ఉద్యమ సమయంలో కళాకారులు చేసిన త్యాగాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, వారికి న్యాయం జరిగేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వివరించారు. ఈ వినతి పత్రాన్ని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే మందుల సామేలు ఉద్యమ కళాకారుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి కళతో ఊపిరి పోసిన సాంస్కృతిక కళాకారులకు న్యాయం జరగాలన్న ఆకాంక్షతో ఎమ్మెల్యే కు కళాకారుల బాధను తెలియపరచి వినతి పత్రం సమర్పించగా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో తమ గళం వినిపిస్తుందని ఆశాభావాన్ని కళాకారులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సాంస్కృతిక సేన నల్గొండ జిల్లా అధ్యక్షులు కోడి భీం ప్రసాద్, సాంస్కృతిక సేన తుంగతుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు పేరాల దయానంద్, తుంగతుర్తి మండల అధ్యక్షులు కొమ్ము ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు కొమ్ము అంజి, తదితర సాంస్కృతిక సేన నాయకులు పాల్గొన్నారు.

## మట్టా దయానంద్ జన్మదిన సందర్భంగా గుల్బర్గా దర్గాలో చాదర్ సమర్పించిన అభిమాన బృందం



సత్తుపల్లి, అక్షిత న్యూస్: కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలో శనివారం రోజు పవిత్రమైన బంద నవాజ్ దర్గాలో జనవరి 2 వ డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ జన్మదిన సందర్భంగా చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,డాక్యుమెంట్ రైటర్ షేక్ జియావుల్ హక్ మరియు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అభిమానుల బృందం. డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా తామంతా పవిత్రమైన బంద నవాజ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని మొక్కుకున్నామని, డాక్టర్ మట్టా దంపతులు ఆయురారోగ్యాలతో ప్రజాసేవ చేస్తూ సత్తుపల్లి నియోజకవర్గం లోని అన్ని వర్గాల ప్రజల తరపున ప్రార్థనలు నిర్వహించాలనుకున్నాం అని అందులో భాగంగా శని వారం రోజు కర్నాటక రాష్ట్రంలో గుర్బర్గాలో ఉన్న పవిత్రమైన బంద నవాజ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాం అని మీడియా కు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణానికి చెందిన పలువురు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అభిమానులు పాల్గొన్నారు.

## అందుల పాలిట ఆరాధ్యుడు డాక్టర్ లూయిస్ బ్రెయిలీ





వరంగల్, అక్షిత బ్యూరో: డా.లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యం కొత్తవాడ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరై డా.లూయిస్ బ్రెయిలీ చిత్రపటం వద్ద నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు...

ఈ కార్యక్రమం లో జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వైద్యులు డా.లక్ష్మీ నారాయణ నిర్వాహకులు నలివేల కల్యాణి, మణిశంకర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యమ నేత ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు

**భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి..**



కుత్బుల్లాపూర్, అక్షిత ప్రతినిధి: టిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు,జన నాయకుడు, ప్రజా సేవకుడు ఆయన కార్యాలయంలో జన్మదిన వేడుకల్లో

జిహెచ్ఎంసి 295 డివిజన్, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మే రెడ్డి సత్యనారాయణ రెడ్డి సేవలు మరువలేనివి-ఆశ్రమ అధ్యక్షులు దెబ్బటి అశోక్





చౌటుప్పల్,అక్షిత ప్రతినిధి: మేరెడ్డి సత్యనారాయణరెడ్డి సేవలు మరువలేనివని సాయి యాదాద్రి సేవా సంస్థ వృద్ధాశ్రమం అధ్యక్షులు దెబ్బటి అశోక్ అన్నారు.చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో మేరెడ్డి సత్యనారాయణ వృద్ధాశ్రమ నెలకొల్పి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉండి ఆశ్రమాన్ని సాయి యాదాద్రి సేవ సంస్థకు నిర్వహణ కోసం అందజేశారని తెలిపారు.సంస్థ సేవలు ఫిబ్రవరి 9న,2020 సంవత్సరం నుండి రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల సహకారంతో సాయి యాదాద్రి సేవా సంస్థ వారు బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సహకారంతో నెలకొల్పి సేవలు నిర్వహిస్తున్నామని తెలిపారు.వృద్ధాప్య కారణాలతో గత సంవత్సర డిసెంబర్ 21న,మే రెడ్డి సత్యనారాయణ మరణించారని తెలిపారు.ఆయన మరణ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆదివారం సంతాప సంస్మరణ సభను ఆశ్రమంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షులు అశోక్ దివంగత మే రెడ్డి సత్యనారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు,అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ రెడ్డి వృద్ధులకు సేవలు అందించాలని కృతనిచ్చేయంతో తమకు ఆశ్రమాన్ని అందజేశారని తెలిపారు.వారి ఆలోచనకు అనుగుణంగా వారు చూపించిన దారిలోనే ఆత్మకు శాంతి చేకూరే విధంగా మేము సేవలందిస్తామని తెలిపారు.సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు.వారు సేవలోనే కాకుండా అనేక రచనలు కూడా రాశారని అందులో శ్రీ నరసింహ కథ కావ్యం,చెంచపురి,మనిషి మానవత్వం,వేదాద్రి శతకం,స్వార్థక జీవనం,మేరెడ్డి భాగవతం,మానవ జీవనంలో ఆధ్యాత్మిక కోణం వంటి పుస్తకాలు రచించారని తెలిపారు.ఆశ్రమ సభ్యులమంతా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కోటి సంపూర్ణ భాగవత్ పారాయణం లో భాగంగా శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ భక్త బృందం పారాయణం నిర్వహించారు.ఆయన రచించిన పుస్తకాలను ప్రచురించి పలువురికి అందజేశారు.ఈ కార్యక్రమంలో దివంగత మే రెడ్డి సత్యనారాయణ భార్య జానకమ్మ,కూతుర్లు వినీత,కల్పన, కుటుంబ సభ్యులు అదేవిధంగా వృద్ధాశ్రయ ఆశ్రమ ప్రధాన కార్యదర్శి జె వై శెట్టి,ఆశ్రమ సభ్యులు నేరెళ్ల కోటేశ్వరరావు,డాక్టర్ రాజు సుధాకర్,పాటి యాదిరెడ్డి,కళ్లెం బాల్ రెడ్డి,రెడ్ క్రాస్ సభ్యులు బాలాజీ,ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్,జెయింట్ సెక్రెటరీ రాజేందర్ రెడ్డి,రాజేంద్రప్రసాద్,అప్పలరాజు,శశాంక్ కుమార్,హనుమాన్,ఏ కోటేశ్వరరావు, రాజేశ్వర్ రాజు,సుధాకర్ రావు,విజయ్ కుమార్ తదితరులు పాల్గొని సంతాపాన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్ యాదవ్‌లచే శ్రీరామ్ నగర్ సి బ్లాక్ కార్యాలయం ప్రారంభం..



శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి.. శేరిలింగంపల్లి డివిజన్ లోగల శ్రీరామ్ నగర్ సీ బ్లాక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ను శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ తో కలిసి ప్రారంభించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ . ఈ సందర్భంగా కార్పొరేటర్ గ మాట్లాడుతూ.. శ్రీరామ్ నగర్ సి బ్లాక్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, స్థానికంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటానని అన్నారు. గత 10 ఏండ్ల కాలంలో ఎమ్మెల్యే సహకారంతో డివిజన్ అభివృద్ధిలో భాగంగా శ్రీరామ్ నగర్ కాలనీ అభివృద్ధికి అనేక నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో కూడా ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే పరిష్కరిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, సీనియర్ నాయకులు రవి కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, చాంద్ పాషా, అనిల్ కుమార్ యాదవ్, బబ్లు, శ్రీరామ్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ బాలగౌడ్, టెంపుల్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి సాగర్, వైస్ ప్రెసిడెంట్ ఈశ్వర్ గౌడ్, జనరల్ సెక్రటరీ రాజేందర్ గుప్తా, ట్రెజరర్ జైపాల్ రెడ్డి, టెంపుల్ జనరల్ సెక్రటరీ రంజిత్ సాగర్, అడ్వైజర్స్ దుర్గయ్య, చారీ, సంజీవ్ రెడ్డి, శైలజ, భూపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రాజన్ బాబు, కృష్ణ సాగర్, సభ్యులు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.